సందడిగా వేసవి విజ్ఞాన శిబిరాలు


చెస్ శిక్షణలో పాల్గొన్న చిన్నారులు


వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో పోలో అసోసియేషన్ చైర్మన్ నాగేశ్వరరావు

గాజువాక: వేసవి విజ్ఞాన శిబిరాలు సందడిగా సాగుతున్నాయి. గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిబిరంలో విద్యార్థులకు యోగాసనాలు, చెస్‌లలో ఆదివారం శిక్షణనిచ్చారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో యోగాసనాలపై యోగా గురు లీలాదుర్గ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు యోగా సాధన చేస్తే పూర్తి ఆరోగ్యంగా జీవిస్తారని, లక్ష్యాలపై అత్యధిక ఏకాగ్రతను కలిగి ఉంటారని చెప్పారు. చదువుపై కూడా ఏకాగ్రతను పెంచుకోవడానికి యోగా దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం గ్రంథాలయాధికారి విద్యార్థులకు చెస్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పుస్తక పఠనం, కథలు చెప్పడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చాక్లెట్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు.

విద్యార్థులకు పోటీలు

పెదగంట్యాడ: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా పెదగంట్యాడ శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం పలు పోటీలు నిర్వహించారు. రీడింగ్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.వి.రమణ పాల్గొన్నారు.

● జీవీఎంసీ 75వ వార్డు నడుపూరు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని పోలో అసోసియేషన్ చైర్మన్ చెల్లుబోయిన నాగేశ్వరరావు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ఇలాంటి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంధం మేఘన, కుసుమ కుమారి, ఉష, లిఖిత, స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి


రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణానంద శర్మను సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అక్కిరెడ్డిపాలెం: పేద బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గున్నంటి పూర్ణానందశర్మ(పూర్ణ) అన్నారు. ఆదివారం ఆయనను ప్రజా సంఘాల నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అగనంపూడిలో స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి దీమల అదృష్టరావు, ఇండియన్ దళిత మైనార్టీ లిబరేషన్ ఫ్రంట్(ఐడీఎంఎల్‌ఎఫ్) కార్యనిర్వాహక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యలమంచిలి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న నాయకులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలను కార్పొరేషన్ ద్వారా అర్హులైన పేద బ్రాహ్మణులకు అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి కృష్ణప్రసాద్, రీమల తరుణ్ గౌతమ్, ప్రేమ్‌చంద్, యలమంచిలి వెంకటరావు, కండిపల్లి చందునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోలాటంతో స్వాగతం పలకాలి


తుంగ్లాంలో కోలాటం మహిళలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు 69వ వార్డు తుంగ్లాంలో తలపెట్టిన కుంచాలమ్మ, దుర్గాలమ్మ, మత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాల ప్రారంభోత్సం వైభవంగా నిర్వహించనున్నట్టు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామంలో కోలాటం ప్రదర్శించే మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రారంభ వేడుకలకు విచ్చేయనున్న లలితా పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామిని సంప్రదాయ పద్ధతిలో కోలాటం బృందాలు స్వాగతం పలకాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు నీలాపు అరుణ, వెంకటలక్ష్మి, రూబీ అంజలి, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి


ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ

గాజువాక: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గాజువాక ట్రాఫిక్ ఎస్‌ఐ వి.అప్పలనాయుడు సూచించారు. ద్విచక్రవాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై పాత గాజువాక జంక్షన్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల గత ఏడాది 147 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారన్నారు. అందువల్ల ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్లను ధరించాలన్నారు. దీని వల్ల తలకు గాయాలు కాకుండా ప్రాణాలతో బయటపడే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలుడు అదృశ్యం



మద్దిపాలెం: కంచరపాలెం పరిధిలో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. కంచరపాలెం 5వ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మీసాల తేజ (15) తల్లిదండ్రులతో కలిసి గొల్ల కంచరపాలెంలో నివసిస్తున్నాడు. ఈ నెల 24 ఉదయం 7.30 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు, బంధువులు ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి మీసాల శ్రీనివాసరావు ఆదివారం కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్ విజయ్ కుమార్ నేతృత్వంలో ఏఎస్‌ఐ రాజారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘స్టీల్‌ప్లాంట్’ పోరాటానికి భెల్ సీఐటీయూ మద్దతు


మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 787వ రోజు జరుగుతున్న రిలే నిరాహారదీక్షలో భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ నాయకులు మద్దతు తెలుపుతూ దీక్షా శిబిరంలో కూర్చున్నారు. ఆదివారం జరిగిన దీక్షా శిబిరంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేపట్టిన పోరాటానికి భెల్ సీఐటీయూ తరపున, ఇతర ప్రభుత్వరంగ సంస్థల తరపున పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని తెలిపారు. భెల్ సీటు నాయకులు ఎస్.జగన్నాథరావు, కె.పవన్ కుమార్, బి.కృష్ణమూర్తి, ఎస్.ప్రసాద్, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పర్యావరణ సైకిల్ ర్యాలీ


ఉక్కు త్రిష్ణా మైదానంలో సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం పర్యావరణ సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో ఉక్కునగరం త్రిష్ణా మైదానంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(పర్సనల్) ఎస్.సి.పాండే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. స్టీల్‌ప్లాంట్ లక్షలాది మొక్కలు నాటి కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ర్యాలీ ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా తిరిగి త్రిష్ణా మైదానానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఫణికుమార్, డాక్టర్ చెన్నా కిషోర్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్, పర్యావరణ విభాగం ఉద్యోగులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, బాపిరాజు, శ్రీనివాస్, ఎం.పెంటారావు, కొండబాబు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు సర్వం సిద్ధం

నేటి నుంచి కౌన్సెలింగ్

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి సర్వం సిద్ధంగా ఉన్నట్లు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే కౌన్సెలింగులో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు.

ఇవి తీసుకురావాలి

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ప్రాసెసింగు ఫీజు రసీదుతో పాటు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఎస్‌ఎస్‌సీ మార్కుల మెమో (ఒరిజినల్ లేదా ఇంటర్‌నెట్ కాపీ), 4–10 తరగతుల వరకు స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ (ఓసీ అభ్యర్థులకు), 01.01.2020 నాడు లేదా తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువపత్రం, కులధృవీకరణ పత్రం, టీసీ, ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు వారికి సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకు రావాల్సి ఉంటుంది.

రాజ్యాంగానికి కేంద్రం తూట్లు


దీక్షలో మాట్లాడుతున్న నీరుకొండ రామచంద్రరావు

కూర్మన్నపాలెం: ప్రపంచంలోనే మహోన్నతమైన భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు విమర్శించారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 836వ రోజు ఉక్కు దీక్షలో ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం కాకుండా పార్లమెంట్‌లో అడ్డుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శ్రీతిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కూర్మన్నపాలెం: పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అనే నినాదంతో శ్రీతిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి ఫిష్ మార్కెట్‌లో ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని కోరుతూ ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ సంచులకు బదులు స్టీల్ బాక్స్‌లు, నార సంచులను వాడి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, వసంతరెడ్డి, భాస్కరరావు, మూర్తి, మల్సూర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి


కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు తదితరులు

గాజువాక/అగనంపూడి/పెదగంట్యాడ/అక్కిరెడ్డిపాలెం: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు శత జయంత్యుత్సవాన్ని టీడీపీ గాజువాక నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ రోడ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నాయకులు నమ్మి సింహాద్రి, పెంటిరాజు తదితరులు పాల్గొన్నారు.

● జీవీఎంసీ 85వ వార్డులో ఎన్టీఆర్ విగ్రహానికి అగనంపూడి టీడీపీ నాయకులు కరణం సత్యారావు, కర్రి అప్పలరాజు, పొన్నగంటి వెంకటరమణ, డొక్కా రమేష్, డొప్పా చినవెంకటరమణ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

● 75వ వార్డు సీతానగరం ఎన్టీఆర్ సెంటర్‌లో ఎన్.టి.రామారావు విగ్రహానికి దొమ్మేటి సోమునాయుడు ఆధ్వర్యంలో పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అండిబోయిన రామునాయుడు, పాము తాతారావు, దొమ్మేటి కనకరాజు, పల్నాల రాజు పాల్గొన్నారు.

● 69వ వార్డు షీలానగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.ఆనంద్, ఎ.జీవన్‌బాబు, మల్లేపూల నిర్మలాకుమారి, గోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

శివప్రసాద్‌రెడ్డిపై ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని అగౌరవపరుస్తూ సిరిపురం సర్కిల్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన జనసేన నాయకుడు శివప్రసాద్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ 28వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు బి.భవానిశంకర్ మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎంపీ వివేకానందరెడ్డి మృతిని కించపరిచేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని కోరారు.

గాజువాకలో ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి

గాజువాక: ప్రధానమంత్రి మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమం సందర్భంగా గాజువాక బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పాత గాజువాక జంక్షన్‌లో ఆ పార్టీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గాజువాకలోని వివిధ జంక్షన్లలో ర్యాలీ కొనసాగింది. అనంతరం నగరంలో ఏర్పాటు చేసిన మన్‌కీ బాత్ ప్రసార కార్యక్రమంలో పాల్గొనడానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు భువనేశ్వరి, రమణ, మాధవి, బాటా శ్రీను, గూటూరు శంకరరావు, బొండా ఎల్లాజీరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు కట్టిన ‘ఘంటసాల జీవితం’


ఘంటసాల నాటకంలో ఓ సన్నివేశం


ఎన్టీఆర్ పాత్రధారికి హార్మోనియం నేర్పిస్తున్న దృశ్యం

మద్దిలపాలెం: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితంలో ముఖ్య ఘట్టాలతో రూపొందించిన నాటకాన్ని కళాకారులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. రంగసాయి నాటకం సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఈ నాటక ప్రదర్శనను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, సురపనేని విజయకుమార్, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన శ్రీసాయి సంతోషి నాట్య మండలి సురభి కళాకారులు ప్రదర్శించిన ఈ నాటకంలో ప్రధానంగా ఘంటసాల వెంకటేశ్వరరావు తొలినాళ్లలో సంగీతం నేర్చుకునే క్రమంలో పడిన కష్టాలను చూపించారు. అనంతరం విజయనగరం సంగీత కళాశాలకు చేరిన తీరుతో పాటు ఆయన వివాహం గురించి చక్కగా సన్నివేశాలు రూపొందించారు. అనంతరం మద్రాసు వెళ్లిన ఘంటసాల అక్కడ సంగీత దర్శకుడుగా, గాయకుడుగా ఎదిగిన తీరును నాటకంలో చూపించిన తీరు అద్భుతం. అదే క్రమంలో క్విట్ ఇండియా ఉద్యమంలో ఘంటసాల పాల్గొన్ని జైలుపాలు అయ్యే సన్నివేశాన్ని కూడా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తర్వాత మద్రాసులో పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేస్తూ చనిపోయిన సన్నివేశంలో ఘంటసాల ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలో భాగస్వాములు ఎలా అయ్యారో కథలో మమేకం చేశారు. అనంతరం ఓ చిత్రంలో హార్మోనియం వాయించే సీన్ కోసం ఎన్టీఆర్.. ఘంటసాల ఇంటికి వెళ్లి హార్మోనియం నేర్చుకున్న సన్నివేశాన్ని చక్కటి పాటతో మేళవించి ప్రదర్శించారు.

ప్రత్యేక ఆకర్షణగా బాలనటులు

నాటకంలో బాల నటీనటులు లవకుశలో పాటలను ఆలపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సురభి చిన్నారులు హిమంసు సంతోషి, జాహ్నవిలను ప్రేక్షకులు అభినందించారు.

గూడు లేని పక్షులు.. గోడు వినేదెవరు?


ఖడ్గమృగం ఎన్‌క్లోజరులో పెలికాన్ పక్షుల సందడి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో పెలికాన్ పక్షులకు గూడు కరువైంది. దీంతో వేరే జంతువుల ఎన్‌క్లోజర్లలో గుంపులుగా వాలుతూ కాలం గడిపేస్తున్నాయి. గూడు చెదిరినా జూ పార్కును విడిచి పెట్టడంలేదు. వాటికి ఉన్న అనుబంధమో ఏమోగాని జూని విడిచి బయటకు వెళ్లలేకపోతున్నాయి. జూ పార్కే తమ ప్రపంచం అంటూ గడిపేస్తున్నాయి. గతంలో ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో ఉంటూ సందడి చేస్తే పెలికాన్ పక్షులు ఇప్పుడు జూలో ఉన్న అన్ని ఎన్‌క్లోజర్లలో రోజుకో చోట కనిపిస్తున్నాయి. ఈ పక్షులు ఏళ్ల తరబడి జూలో ఉన్నాయి. వాటికి పెద్ద పులులు ఎన్‌క్లోజరు ఎదురుగా అప్పట్లో జూ అధికారులు రెండు గూళ్లు నిర్మించారు. జూకి వెళ్లే సందర్శకులు ఆ గూళ్ల వద్ద వాటిని చూసి సంబరపడేవారు. ఎత్తయిన, విశాలమైన ఆ గూళ్లు 2014 అక్టోబరులో వచ్చిన హుద్‌హుద్ తుపాన్ ధాటికి కూలిపోయి శిథిలమైపోయాయి. దీంతో ఆ గూళ్లలో ఉండే పెలికాన్ పక్షులు కొన్ని మృత్యువాత పడ్డాయి. మిగిలినవి చెల్లాచెదురైపోయాయి. తుపాన్ ధాటికి గూళ్ల నుంచి బయటపడిన ఆ పక్షులు ఎక్కడికి ఎగిరిపోయాయో కొద్ది రోజులు వరకు జూ అధికారులు, సిబ్బందికి సైతం తెలియలేదు. ఆ తరువాత వారంలో అవన్నీ మళ్లీ జూలో చెట్లపైనే అక్కడక్కడా కనిపించాయి. మరికొద్ది రోజులు తర్వాత అన్నీ ఒకేచోటకు చేరి గుంపులుగా తిరుగుతూ రాత్రులు ఒకే చెట్టుపై చేరుతున్నాయి. ఆహారం కోసం జూలో ఖడ్గమృగం, ఏనుగులు, కోతుల ఎన్‌క్లోజర్లలో వాలుతున్నాయి. చెట్లపైన చిన్న గూడుకట్టుకొని గుడ్లు పెట్టి సంతతిని పెంచుకుంటున్నాయి. జూ లోపల అధికారులు వన్యప్రాణుల కోసం కొత్త ఎన్‌క్లోజర్లు నిర్మిస్తున్నారు. మరికొన్ని ఎన్‌క్లోజర్లకు మరమ్మతులు చేపడుతున్నారు. తమకు కూడా ఓ ఎన్‌క్లోజరు ప్రత్యేకంగా నిర్మించండి మహాప్రభో అన్నట్లు అధికారులు వైపు ఈ పక్షులు దీనంగా చూస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పెలికాన్ పక్షుల కోసం గూడు నిర్మించే దిశగా ఆలోచన చేస్తే బాగుంటుందని సందర్శకులు కోరుతున్నారు.